క్లుప్తంగా

కొండచిలువ కలకలం



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని శ్రీపురం రోడ్డులోగల పాత ఇనుపసామాన్ల గోడౌన్‌లో కొండచిలువ కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలో పాలెం లక్ష్మయ్య పాత సామాను కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. శనివారం రాత్రి దుకాణంలోకి కొండ చిలువ ప్రవేశించింది. గమనించిన స్థానికులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్‌చేశారు. దుకాణంలో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. కొంచెం సమయానికి కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో యువకులు కర్రలతో కొట్టి చంపేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

నేడు సర్దార్ పాపన్న విగ్రహావిష్కరణ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్‌యార్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లయ్యగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు విగ్రహావిష్కరణ ఉంటుందని, అనంతరం సాయిగార్డెన్స్‌లో సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సాగునీరు విడుదల చేయాలి




వెల్దండ: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల చేసి రైతులను తాదుకోవాలని మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్ణాటక, ఇతర రాష్ట్రాలల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణానది, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టుల నుంచి ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు నీరు భారీ చేరుతోందన్నారు. ప్రాజెక్టుల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా నీరు చేరుతోందని పంటలకు సాగునీరు వదిలి రైతులను ఆదుకోవాలన్నారు. మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కడారి కృష్ణయ్య, రవికుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం




వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని గ్రామ సేవా సమితి, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10వేల నగదు, 50కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.8 వేలు, అదే విధంగా గ్రామంలో చందాలు చేసి రూ.43 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వీరేందర్‌యాదవ్, మల్లయ్య, రవి ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



వెల్దండలో..



కోడేరులో..

వెల్దండ: నూతనంగా ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కురుమూర్తిని ఆదివారం మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, కొండల్‌యాదవ్‌లు సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ఎస్‌ఐగా గోకారి

కోడేరు: మండల ఎస్‌ఐగా కుర్తికుంట గోకారి ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ కురుమూర్తి వెల్దడకు బదిలీపై వెళ్లారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వర్తిస్తున్న గోకారి మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు.

కూలేందుకు సిద్ధంగా..

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
- పడకేసిన మన ఊరు–మన బడి పథకం



కూలిన జీల్గుపల్లి పాఠశాల తరగతి గదులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న కోమటికుంట పాఠశాల తరగతి గదులు

లింగాల: మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. భయం గుప్పిట్లో విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన దుస్థితి దాపురించింది. కొన్నేళ్ల కిందట నిర్మించిన పాఠశాల భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులు వరండాలలో చదువులు కొనసాగిస్తున్నారు. ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల భవనాలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సమస్యల వలయంలో సరస్వతి నిలయాలు కొట్టుమిట్టాడుతున్నాయి. పాలకులు మాత్రం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని గొప్పలు చెబుతారే తప్పా ఆచరణలో అమలు కావడంలేదని పలువురి నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

పెచ్చులూడుతున్న పైకప్పులు

మండలంలో రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 06 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉన్నత పాఠశాలల పరిస్థితి కాస్తా మెరుగ్గా ఉన్నప్పటికి ప్రాథమిక పాఠశాలల దుస్థితి మరింత దారణంగా ఉంది. మండలంలోని కోమటికుంట, శాయిన్‌పేట, దారారం ప్రాథమికోన్నత పాఠశాలల గదుల పైకప్పుల పెచ్చులు ఉండడం, గోడలు పగుళ్ల రావడంతో వర్షాలకు గదులలో విద్యార్థులు కూర్చోవాలంటే వెనుకంజ వేస్తున్నారు. జీల్గుపల్లి, మాడాపూర్, పద్మన్నపల్లి, రాంపూర్, బాకారం, మగ్గంపూర్ తదితర పాఠశాలలో కొన్నింటిలో తరగతి గదులు కూలడం, గోడలకు పగుళ్ల రావడంతో విద్యార్థులను వరండాలలో, ఆరుబయట కూర్చోబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. పద్మన్నపల్లిలో పాఠశాల పూర్తిగా పనికి రాకుండా పోవడంతో తరగతులను చెంచు కాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్నారు. మరో పక్క కనీస సౌకర్యాలైన తాగు నీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అసంపూర్తిగా పనులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన మన ఊరు–మన బడి పథకంలో మండలంలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపికైన వాటిలో కొన్నింటిలో తరగతి గదుల నిర్మాణాలు చేపట్టి అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే ఆపివేశారు. దీనితో ఈ పథకం మండలంలో ఆశించిన స్థాయిలో అమలుకాలేదు.

పాలకులు పట్టించుకోవాలి



మండలంలో ఏటేటా ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది శిథిలావస్థకు చేరిన పాఠశాలలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పాఠశాలల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి.

– చంద్రశేఖర్, శాయిన్‌పేట

కమ్యూనిటీ భవనంలో తరగతులు



మండలంలోని పద్మన్నపల్లి ప్రాథమిక పాఠశాల భవనాలు కూలుతున్నాయి. రెండేళ్ల నుంచి గ్రామంలోని చెంచుకాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనంలో తరగతులను నిర్వహిస్తున్నారు. తరగతి గదుల నిర్మాణాలకు రెండేళ్ల కిందట నిధులు మంజూరు కాగా పనులు మాత్రం చేపట్టలేదు.

– రాజునాయక్, పద్మన్నపల్లి

నిధులు మంజూరైతేనే..



శిథిలావస్థలో ఉన్న పాఠశాలల గురించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. మన ఊరు–మన బడి పథకంలో 10 పాఠశాలలను గుర్తించి పనులు చేపట్టాం. బిల్లులు అందక సకాలంలో పనులు పూర్తి కాలేదు. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడుతాం.

– చంద్రుడు, ఎంఈఓ, లింగాల

15వ వార్డులో చెత్త తొలగింపు



చెత్తను ఆటోల ద్వారా సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. పలు వార్డుల నుంచి ప్రజలు ఫోన్‌చేసి ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో ఎక్కువగా కుక్కల బెడద, చెత్త తీయడం లేదని ఫిర్యాదు చేశారు. కుక్కల గురించి కౌన్సిల్‌లో చర్చించి చర్యలు తీసుకుంటామని వివరించారు. 15వ వార్డు నుంచి పట్టణవాసి యాదగిరి మాట్లాడుతూ కాలనీలో చెత్తపేరుకుపోయిందని, చెత్త ఆటోలు రావడం లేదని తెలిపారు. దీంతో కమిషనర్ స్పందించి పలు వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ఆదివారం ఆటోల ద్వారా తరలించారు. సమస్యను నేరుగా కమిషనర్‌కు చెప్పుకునేలా అవకాశం కల్పించిన సాక్షికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు



తాడూరు: మండల కేంద్రంలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనుసరించుకొని ఉన్న విద్యుత్ లైన్ గాలికి చెట్లు విరిగి పడడంతో స్తంభం విరిగింది. సమయానికి ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ ఏఈ శ్రీరాములు ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు చేపట్టారు. ఆస్పత్రి ప్రహరీకి అనుసరించుకొని ఉన్న చెట్లు వైర్లపై పడడంతో స్తంభం విరిగింది. విరిగిన స్తంభం స్థలంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించి తెగిన విద్యుత్ వైర్లను సరిచేసి అదనంగా మరో రెండు కొత్త వైర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: రైతుబీమాకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఆదివారం ఏఓ నీతి ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 28వ తేదీ వరకు వ్యవసాయం భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల అర్హులని పేర్కొన్నారు. వచ్చే నెల ఆగస్టు 3వ తేదీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని వివరించారు. దరఖాస్తుఫారం, పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు, నామినీ ఆధార్ జిరాక్స్‌ను సమర్పించాలని కోరారు.

డబ్బులు ఇప్పించండి



తాడూరు: జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం మండల కేంద్రానికి చెందిన బాధితుడు ఆంజనేయులు, ఇతర బాధితులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంస్థకు సంబంధించిన వ్యక్తి తమ దగ్గర నుంచి డబ్బులు తీసుకొని నెలనెల వడ్డీ ఇస్తానని నమ్మించాడని పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన 40 మంది బాధితుల నుంచి రూ. 3.50 కోట్లు వసూలు చేశాడని వివరించారు. సంస్థ నుంచి తిరిగి డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు రైతులతో కలిసి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, బాలస్వామి మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 85 మందికి రుణమాఫీ వర్తించిందన్నారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం



కంటిఅద్దాలు పంపిణీ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: పేదలకు సేవ చేయడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఆసంస్థ చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏవీఆర్‌గార్డెన్‌లో ఐక్యతా ఫౌండేషన్, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. అనంతరం కంటి శుక్లాలకు సర్జరీలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, దళపతిగౌడ్, శ్రీరాములు, పంతులనాయక్, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్, శివ, సలీం, అభినవ్‌రెడ్డి, యూసుఫ్‌బాబా, గణేష్, మల్లేష్, హస్సన్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



గ్రంథాలయం కాలనీల్లో డ్రెయినేజీ నిర్మాణం లేక రోడ్లపై పారుతున్న మురుగు



పిచ్చిమొక్కలతో నిండి ఉన్న పరిసరాలు

అమ్రాబాద్: మండల కేంద్రంలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలలో అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. మురుగు రోడ్లపైనే పరుగులు పెడుతోంది. రోడ్లు చిత్తడిచిత్తడిగా దర్శనమివ్వడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు కూడా కాలనీవాసులు జంకుతున్నారు. మురుగు ఒకేచోట నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వ్యాప్తిచెందుతున్నాయని పలు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ముసురు వర్షాలకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.

దెబ్బతిన్న అంతర్గతరోడ్లు

మండల కేంద్రంలో మొత్తం 1400 వందల పైచిలుకు కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రంథాలయం వెళ్లే కాలనీ, రజకకాలనీ, ఇందిరమ్మ, మైనార్టీ, వ్యవసాయ మార్కెట్ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందించే కార్యక్రమంలో భాగంగా అప్పట్లో పలు చోట్లా సీసీ రోడ్లు ధ్వంసం చేసి పైప్‌లైన్ తీసిన కాంట్రాక్టర్ తిరిగి ఆ రోడ్లను మరమ్మతు చేయించలేదు.

రోడ్లపైనే మురురునీరు

డ్రెయినేజీలు సక్రమంగా లేక మద్దిమడుగు వెళ్లే ప్రధాన రహదారి వెంట సమీపంలో, రజకకాలనీ, అంబేడ్కర్‌కాలనీ, గ్రంథాలయం కాలనీలో మినీ బోర్ల నుంచి ప్రజలు పట్టుకుంటున్నప్పుడు వృథా నీరు రోడ్లపై పారుతోంది.

పరిసరాలు అపరిశుభ్రం...

పరిసరాల అపరిశుభ్రతతో ముఖ్యంగా ప్రస్తుత ముసురు వర్షాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు కాలనీల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పలు చోట్లా మురుగు కాల్వలు దుర్గంధ వాసన వెదజల్లుతున్నాయి. దోమలు వృద్ధి చెంది కరెంట్ లేకపోతే రాత్రి వేళ్లలో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను బాగు చేయాలని పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం

కాలనీలలో రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నా. రెండు మూడు రోజుల నుంచి పనులకు వర్షం ఆటంకంగా మారింది. మురుగు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకుంటున్నాం. అక్కడక్కడ మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తాం.

– మల్లేష్, పంచాయతీ కార్యదర్శి, అమ్రాబాద్

గోరింటాకు సంబురం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య కమిటీ ప్రతినిధి సాయి జ్యోతి గోరింటాకు విశిష్టతను వివరించారు. ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడంల ఆనవాయితీ అని పేర్కొన్నారు. మహిళలు గోరింటాకు పెట్టుకుని ప్రదర్శించి సంబురపడ్డారు. కార్యక్రమంలో కార్యదర్శి సంబు శోభ, కోశాధికారి సూరిశెట్టి సంధ్యారాణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో ఆదివారం వీధికుక్కల దాడికి గురై మృతిచెందిన వానరానికి గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. వానరుడు సాక్షత్తు ఆంజనేయస్వామి స్వరూపమని భావించిన గ్రామస్తులు మృతిచెందిన వానరాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శివారులో కననం చేశారు. గ్రామంలోని వీధి కుక్కల నివారణకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దర్గేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



అచ్చంపేటలో

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ధర్మవ్యాధ మహర్షి, లక్ష్మణ్‌దాస్ చిత్రపటాల వద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా కటిక్ ఫెడరేషన్ కార్యదర్శి మండికారి బాలాజీ, లక్ష్మణ్‌జీ, బాలాజీ, గంగాజీ, లక్ష్మణ్, రఘు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, కుంకుమార్చన నిర్వహించారు. తీర్థప్రసాదాలు, అన్నదానం స్వీకరించారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మన్ననూర్ లోని వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురు పూజ విశిష్టతను వివరించారు. భక్తులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సాయిబాబా ఆలయంల్లో ప్రత్యేక పూజాలు చేశారు. మండల కేంద్రంలోని ఓంకారం, సుప్రభాతసేవ,కాగడ హారతి, నగరసంకీర్తన, గణపతిపూజ, షిరిడిసాయి, సత్యసాయిబాబాలకు క్షీరాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, శేజహారతి తదితర పూజాలు నిర్వహించి తీర్థ ప్రసాదలు అందజేశారు. అర్చకుడు రాఘవేంద్రశర్మ, దూరెడ్డి స్వాతి, ఆముదాల గీత, యుగేందర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: సమాజానికి మార్గదర్శకులు గురువులని బీజేపీ జిల్లా నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భంగా రిటైర్డ్ లెక్చరర్లు, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, నరేడ్ల శేకర్‌రెడ్డి, వివేకానంద, బాబిదేవ్, చందుముదిరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో..

కంకర, రాళ్ల కుప్పలు తొలగించాలి



ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం ఎదుట పోసిన రాళ్లు, కంకర కుప్పలు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల ఎదుట రాళ్లు, కంకర కుప్పలు పోయడంతో ఉప కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వర్షాకాలం సీజన్ కావడంతో విషసర్పాలు సంచారించే అవకాశం ఉందని, ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో కొన్ని నెలల కిత్రం ఓ కాంట్రాక్టర్ భవన నిర్మాణం కోసం తీసుకొచ్చిన సామగ్రిని ఇలా ఈ కేంద్రాల ముందు పోసి అలానే వదిలివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాళ్లు, కంకర కుప్పలను తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.